క్లుప్తంగా

17 నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు



తెనాలి టౌన్: పట్టణంలోని వీఎస్ఆర్ కాలేజీలో వడ్లమూడి హాస్పటల్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఈనెల 17 నుంచి శరణాగతి ట్రస్టు ఆధ్వర్యంలో ధనుర్మాస వ్రతమహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ట్రస్టు సభ్యులు తెలిపారు. వ్రతాలకు సంబంధించిన పోస్టర్లు నరేంద్రరామానుజ దాస స్వామి ఆవిష్కరించారు. ఉత్సవాలు సందర్భంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూజలు, యాగాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జనవరి 14న గోదాదేవి కళ్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రూ.3.05 లక్షల చెక్కు పంపిణీ



తెనాలి: ఆకస్మిక మరణం చెందిన వాసవీ క్లబ్ నిజాంపట్నం సభ్యుడు రవీంద్రగుప్త భార్య సంధ్యారాణికి వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోనుగుంట్ల జయంత్‌కుమార్ శనివారం తెనాలిలో రూ.3.05 లక్షల చెక్కును అందజేశారు. చనిపోయిన సభ్యుల కుటుంబాలను ఆదుకునేందుకు వాసవీ క్లబ్ 2023 సంవత్సరం జిల్లా పరిధిలో రూ.30 లక్షలు, ఇంటర్నేషనల్ పరిధిలో రూ.3.50 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.50 కోట్లను పంపిణీ చేశామన్నారు. చెక్కు పంపిణీ కార్యక్రమంలో మాడా వెంకట సుబ్బారావు, బయ్యా శ్రీనివాసరావు, గొడవర్తి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

విత్తన ఉత్పత్తి పథకంపై రైతులకు శిక్షణ



తెనాలి టౌన్: రైతులందరూ సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ పి.రామాంజనేయులు అన్నారు. రూరల్ మండలం బుర్రిపాలెం, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని సచివాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఓ ప్రేమ్‌సాగర్ అధ్యక్షత వహించారు. పీడీ రామాంజనేయులు మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినందున వరి పంటలను రైతులు త్వరగా కోసుకోవాలన్నారు. తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండి, పంటలు కాపాడుకోవాలన్నారు. పంట కోత సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ రాజవంశీ, ఏఈఓ మోహన్, వీఏఏలు గోపినాథ్, గ్రామీణ విత్తన పథకం రైతులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



వడ్డమాను(తాడికొండ): సమగ్ర ఎరువులు, పురుగు మందుల వాడకం, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని తుళ్లూరు మండల వ్యవసాయాధికారి శ్రీ రంజని తెలిపారు. తుళ్లూరు మండలం వడ్డమానులో శనివారం నిర్వహించిన పొలంబడిలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన నారు పెంపకంతో పాటు మిత్ర పురుగుల్ని సంరక్షించుకోవాలని సూచించారు. ప్రతి వారం పొలం పరిసరాల్ని విశ్లేషణ చేయాలని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాల్ని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సాగులో మెలకువలతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వడ్డమాను గ్రామ వ్యవసాయ సహాయకులు టి.సాయిసుందర్, బుర్రా రామకృష్ణారెడ్డి, వెంకట శివారెడ్డి, చుండు వెంకటరెడ్డి, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రగ్బీ జాతీయ జట్టుకు నూతక్కి విద్యార్థుల ఎంపిక

నూతక్కి(మంగళగిరి): నగర పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. గత నెల 21 నుంచి 24 వరకు కర్నూలులో 67 వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు నిర్వహించారు. అండర్ –17 జట్టుకు పదో తరగతి విద్యార్థి ఎస్‌కే. హర్షీద్, అండర్ –14 జట్టుకు అంకరంశెట్టి శ్రీలక్ష్మి, దాసరి షారోన్ కృపావల్లి ఎంపికయ్యారని శనివారం పీడీ రజనీ నాయక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్ని నూతక్కి సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఈవో శ్యామ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మజ అభినందనలు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

పట్టణానికే తలమానికంగా తెనాలి బండ్

- శరవేగంగా నిర్మాణ పనులు
- జనవరిలో తొలి దశ విగ్రహాల ప్రతిష్ట
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కెనాల్ బండ్‌పై అధికారులతో ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి: తెనాలి–విజయవాడ రోడ్డులో పట్టణ సరిహద్దుల్లో నిజాంపట్నం కాల్వకట్టపై నిర్మిస్తున్న కెనాల్ బండ్ ఆంధ్రాప్యారిస్ తెనాలికి తలమానికంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. బ్యూటిఫికేషన్ పూర్తిచేసుకుని జనవరిలో తొలి దశ విగ్రహాల ప్రతిష్ట చేయనున్నట్టు వెల్లడించారు. నిర్మాణంలో వున్న కెనాల్ బండ్ ప్రదేశాన్ని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులను సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తికావాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెనాలి ప్రాంతానికి వివిధ రంగాల్లో కీర్తిని తీసుకొచ్చిన మహనీయుల విగ్రహాల ప్రతిష్ట, ఆహ్లాదకరంగా ఉండేలా పరిసరాల బ్యూటిఫికేషన్‌తో ఆ ప్రాంతం పట్టణవాసులకు ఆటవిడుపుగా, ఇతర ప్రాంతాల వారికి పర్యాటక ప్రాంతంగా ఉంటుందన్నారు. విగ్రహాల ప్రతిష్టకు అవసరమైన దిమ్మెల నిర్మాణం పూర్తయిందని, పూర్తిగా గ్రానైట్‌తో వీటిని సుందరంగా నిర్మించినట్టు చెప్పారు. వర్షపు నీరు నిల్వవుండకుండా త్వరితగతిన వెళ్లిపోయేలా పైప్‌లైన్ నిర్మాణం, మ్యాన్‌హోల్‌ల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. ఆ వెంటనే బ్యూటిఫికేషన్ పనులు చేపడతామని చెప్పారు. సందర్శకులకు ఆహ్లాదకరంగా ఉండటమే కాకుండా అల్పాహారం కోసం రెండు క్యాంటీన్లను అక్కడ నిర్మిస్తున్నామని తెలిపారు. స్వాగతం ద్వారంతో సహా అనీ సమకూర్చుకుని, జనవరి నెలలో తొలి దశ విగ్రహాలను ప్రతిష్టిస్తామని వివరించారు. వీరితో మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు, కౌన్సిలరు పేరం సంజీవరెడ్డి, పార్టీనేతలు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, మన్నవ ప్రభాకర్, పెచ్చింగ్ సుభాని, అక్కిదాసు కిరణ్ తదితరులు ఉన్నారు.

రూ.ఆరు కోట్లతో పలు అభివృద్ధి పనులు..

తెనాలిఅర్బన్: గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగా తెనాలి పట్టణంలో రూ.6 కోట్లతో సిమెంట్ రోడ్లు, కాల్వలు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. ఎనిమిదో వార్డులోని హిందీ ప్రేమీ మండలి దగ్గర నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు రోడ్డు నిర్మించాలని కోరినట్లు చెప్పారు. వారి వినతి మేరకు రూ.15లక్షలు దీని కోసం వెచ్చించినట్లు తెలిపారు. కౌన్సిలర్‌లు ఆవుల కోటయ్య, తోట రఘురామ్, షేక్ దుబాయ్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గ, తట్టుకుళ్ళ అశోక్ యాదవ్, ఎంఈఈ నాగమల్లేశ్వరరావు, డీఈ నాగభూషణం, ఏఈ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే బురద చల్లాలని చూశారు

- శివాజీచౌక్‌లో మహిళ హల్‌చల్‌పై వైఎస్సార్ సీపీ నేతలు
- పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆటోడ్రైవర్లు, వైఎస్సార్ సీపీ నేతలు

తెనాలి: స్థానిక శివాజీచౌక్‌లో తాను నడుపుకొంటున్న టిఫిన్ బండిని అక్రమంగా తొలగించారని, బండి పెట్టుకోవటానికి డబ్బులు చెల్లించమని కోరారంటూ మహిళ చేసిన ఆరోపణలు బూటకమని, పథకం ప్రకారం నడిపించిన నాటకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత తాడిబోయిన రమేష్, అక్కడి ఆటోపాయింట్ డ్రైవర్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది టిఫిన్ బండిని తొలగించిన మీదట శుక్రవారం అక్కడ పెట్రోలు సీసాతో హైడ్రామా సృష్టించటం, అడ్డొచ్చిన పోలీసులపై హల్‌చల్ చేసిన ఉదంతాన్ని వారు గుర్తుచేశారు. అదే ప్రదేశంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్కురోడ్డు మూలమలుపులో, పెట్రోలు బంకు సమీపాన టిఫిన్ బండి నడుపుకొంటున్న కుటుంబం, మరో బండిని చేర్చటం, స్టూల్స్ వేసి కస్టమర్లను కూర్చోబెట్టటం, పైన కప్పులాగ తడికెను ఉంచి, వ్యాపారాన్ని విస్తరించింది. అసలే ఇరుకురోడ్డు, పైగా రద్దీగా ఉంటుండే రోడ్డులో రెండుపూటలా వచ్చే స్కూల్ బస్సులతో అక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య అనివార్యం. కొత్తగా వచ్చిన మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో మురుగుకాల్వల్లో పూడిక తీయిస్తున్నారు. ఆ క్రమంలో పార్కురోడ్డు మలుపులో పూడిక తీయించేందుకని టిఫిన్ బండిని తీయమని ఆదేశించారు. దీనితో అక్కడకు సమీపంలోని ఆటో పాయింట్ వద్దకు చేర్చారు. ఇందుకు అభ్యంతరం తెలిపిన తమపై సదరు మహిళ ఆగ్రహంతో నూనె పోసిందని ఆటోడ్రైవర్ ఆళ్ల ప్రభాకర్ చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేయటంతో, మున్సిపల్ సిబ్బంది వచ్చి టిఫిన్ బండిని కార్యాలయానికి తీసుకెళ్లినట్టు తాడిబోయిన రమేష్ వెల్లడించారు. దీనిపై తనను వ్యక్తిగతంగా దుర్భాషలాడటమే కాకుండా సహచర కౌన్సిలరుపై ఆరోపణలు చేసినట్టు గుర్తుచేశారు. ఇదే ఆసరాగా మాజీమంత్రి, టీడీపీ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ తమపైనా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌పైనా ఆరోపణలు చేయటం దారుణమన్నారు. లంచాలు తీసుకోవటం, అవినీతి పనులకు పాల్పడటం టీడీపీ నేతల అలవాటని చెబుతూ, తాము, తమ నాయకుడు ఎలాంటి అవినీతికి పాల్పడబోమని స్పష్టంచేశారు. పార్టీ లీగల్ సెల్ నాయకుడు భేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ ఒక మహిళను అడ్డంపెట్టుకుని పథకం ప్రకారం తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్టు ప్రకటించారు. దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. వీరితో మున్సిపల్ కౌన్సిలర్లు తోట రఘురామ్, ఆవుల కోటయ్య, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, మన్నవ ప్రభాకర్, ఢాకా అంకిరెడ్డి, తాడిబోయిన బుజ్జిబాబు తదితరులు ఉన్నారు.

పెన్నీ మినిస్ట్రీస్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు



పేదలకు నూతన వస్త్రాలు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దిలీప్‌రాజా, మిలటరీ ప్రసాద్

తెనాలిరూరల్: ఆకలితో ఉన్న పేదల ఆకలి తీర్చాలని, అవసరమున్న వారికి నూతన వస్త్రాలు సమకూర్చాలని ఏసుక్రీస్తు బోధనలు చెపుతున్నాయని పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా చెప్పారు. రూరల్ మండలం పెదరావూరు గ్రామంలోని పెన్నీ మినిస్ట్రీస్ సంస్థ కార్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించమన్న బైబిల్ సూక్తులను ప్రజలందరూ ఆచరిస్తే దేశాల మధ్య యుద్ధాలు ఉండవన్నారు. క్రీస్తు బోధనలు పాటించడంలో నిజమైన మానవత్వం ఉందన్నారు. నటుడు మిలటరీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రేమతత్వాన్ని చిన్నతనం నుంచి పిల్లలకు అలవర్చాలని సూచించారు. పాస్టర్ మట్లపూడి జోషి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వితంతువులకు నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అయినంపూడి లోకేష్, బొంత కృపమ్మ, చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రారంభం

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్‌ఎస్ఎస్ యూనిట్‌ను శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసమని, దేశ పురోభివృద్ధిలోనూ పాలుపంచుకోవటం, సంఘసేవ చేయటం కూడా తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యాభ్యాసానికి ఆటంకం లేకుండా సంఘసేవ చేసే అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా విద్యార్థులు సామాజికసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ యనిట్–1 ప్రోగ్రాం అధికారి కళ్యాణ్‌చక్రవర్తి, యూనిట్–2 ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జ్యోతిబసు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు దొర్లితే చర్యలు



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలిరూరల్: ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సంబంధిత బీఎల్‌ఓలు, బీఎల్ఏలు, ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె. రవిబాబు హెచ్చరించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల ప్రత్యేక క్యాంపును నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో శనివారం నిర్వహించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు తప్పనిసరిగా పోలింగ్ కేంద్రల వద్ద శని, ఆదివారాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తెనాలి పట్టణం, మండలంలోని కేంద్రాలను తహసీల్దార్ తనిఖీ చేశారు. జాబితాలో ఫోటోలు సరిగా లేని, తప్పు ఫోటో ఉన్న ఓటర్లను సంప్రదించి ఫోటోను మార్చాలని, డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓట్లను తొలగించడంలో పూర్తి పారదర్శకంగా ఉండాలని, వాటిని తొలగించడంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు క్రిమినల్ కేసులను సైతం నమోదు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లతో మాట్లాడి వారి అర్జీలను తహసీల్దార్ స్వీకరించి పరిశీలించారు.

కొనసాగుతున్న సామాజిక పింఛన్ల పంపిణీ



తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బంగారయ్యకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ అనుషా



నెహ్రూరోడ్డులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తూ..



సుల్తానాబాద్‌లో వితంతు పింఛన్ అందిస్తూ..

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం శనివారం కొనసాగింది. వార్డు వలంటీర్‌లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వాటిని పంపిణీ చేశారు. లబ్ధిదారులు కొందరు అనారోగ్య కారణాలతో వివిధ హస్పటల్స్‌లో ఉండటంతో అక్కడికి వెళ్లి వాటిని పంపిణీ చేశారు.

నేడు సామూహిక వ్రత మహోత్సవం

తెనాలిఅర్బన్: సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో షరాఫ్ బజారులోని శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీరామసహిత సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 108 మంది దంపతులచే సామూహిక వ్రత మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. వ్రత మహోత్సవంలో పాల్గొనే వారికి పూజా సామగ్రిని ఉచితంగా ఇవ్వటంతో పాటు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా సామూహిక సత్యదేవ వ్రతం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సోలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ మందిరంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఆలయ మండపంలో వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతం, పూజల్లో 120 జంటలు పాల్గొన్నాయి. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు వై.యల్లారెడ్డి పర్యవేక్షించారు.

బీఎల్‌ఓలంతా అందుబాటులో ఉండాలి

కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి



గుడ్‌న్యూస్ స్కూలులో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

తాడేపల్లిరూరల్ : బీఎల్‌వోలు తమకు కేటాయించిన కేంద్రాల్లో ఉండి ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6,7,8లను సేకరించాలని కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శనివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట వెంబడి ఉన్న గుడ్‌న్యూస్ స్కూలులో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపైన్ డేను పరిశీలించారు. ఎంత మంది ఓటర్లు తమ పేర్లు సరి చూసుకున్నారు? ఎన్ని క్లెయిమ్స్ వచ్చాయి? మార్పులకు వారు ఇచ్చిన దరఖాస్తుల వివరాల్ని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వో రిజిస్టర్, వారి వద్ద ఉన్న 6,7,8 ఫారాల్ని పరిశీలించి సూచనలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లు జాబితాలో పేర్లను సరి చూసుకుని ఓటు హక్కును పొందేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ లక్ష్మీకుమారి, ఏఈఆర్ఓ, తాడేపల్లి డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సూపర్‌వైజర్ వెంకట కృష్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలి

తెనాలిరూరల్: ప్రజల స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు పరచాలని తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సభ్యులు కోరారు. శనివారం సాయంత్రం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడు, న్యాయవాది దరిశి శివకోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ యాక్టు ద్వారా స్థిరాస్తుల వివాదాలు సివిల్ కోర్టుల పరిధి నుంచి రెవెన్యూ ట్రిబ్యునల్‌కు మారతాయని చెప్పారు. ఈ ట్రిబ్యునల్‌లో చట్టాలతో సంబంధం లేకుండ సహజ న్యాయసూత్రాలు(ప్రిన్సిపల్స్ ఆఫ్ నేచురల్ జస్టిస్) ఆధారంగా తీర్పులు ఇస్తారని వివరించారు. ఆస్తుల హక్కులను న్యాయ పరిధి నుంచి తొలగించడం ద్వారా రాజకీయ కబంధ హస్తాలలోకి వెళ్లే ప్రమాదముందన్నారు. ఈ చట్టాలన్ని రద్దు చేసేందుకు అన్ని వర్గాలు పోరాడేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. రావూరి శివశంకరరావు, వాకా పేరిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ ఆరిఫ్, అబ్రహం లింకన్ తదితర న్యాయవాదులు మాట్లాడారు.

ముక్కోటికి సిద్ధమవుతున్న నారసింహుడు

ఈ నెల 5న సమన్వయ సమావేశం

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ముక్కోటి ఉత్సవానికి సిద్ధమవుతున్నారు. జనవరి 23న తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న భక్తులకు ఏర్పాట్లుపై అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఏటా ముక్కోటి ఉత్సవానికి 80వేల నుంచి లక్ష మంది తరలివచ్చి స్వామిని దర్శించుకుని, బంగారు శంఖు తీర్థం స్వీకరిస్తారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేయనున్నారు.

చెరువు స్థలం వివాదంపై ప్రభుత్వానికి నివేదిక

తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ




యర్రబాలెం చెరువును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దార్ రామ్‌ప్రసాద్

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం చెరువును శనివారం తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. చెరువు స్థలం కోర్టు వివాదంలో ఉన్న నేపథ్యంలో ఆమె సందర్శించారు. స్థలం వివాదంపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ.వి.రామ్‌ప్రసాద్, ఆర్ఐ సాంబశివరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నగరంలో యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో ఈ నెల 6న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓ వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో తెనాలి కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దార్ జీ.వి.రామ్‌ప్రసాద్, రూరల్ సీఐ భూషణం, ఎస్ఐ క్రాంతికుమార్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఆరోగ్యశ్రీలో విస్తృత వైద్యసేవలు



ఫిరంగిపురం: ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల జబ్బులకు వైద్యసేవలు అందుతాయని వైద్యురాలు ఎస్తేరురాణి చెప్పారు. మండలంలోని సచివాలయ–2 పరిధిలోని అల్లంవారిపాలెంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 79 మంది రోగులకు పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న రోగుల వద్దకు వెళ్లి, పరీక్షలు చేసి తగిన సూచనలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లో విద్యార్థులకు శారీరక, ఎత్తు, బరువు, రక్త నమూనా పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌వో గోవర్దన, ఏఎస్‌ఎం మాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువతిపై యువకుడు దాడి

ఆసుపత్రికి తరలించిన తాడేపల్లి పోలీసులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యానాదుల కాలనీలో నివాసముంటూ సహజీవనం చేస్తున్న యువతి, యువకుడి మధ్య ఏర్పడిన వివాదం శనివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అక్కడ కూడా మద్యం మత్తులో గొడవపడి యువతిపై యువకుడు బ్లేడ్‌లాంటి ఆయుధంతో దాడి చేయగా గాయపడింది. పోలీసులు ఆ యువతిని వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం... కర్ణాటకకు చెందిన పోలా కిరణ్, బుజ్జి కొంతకాలం కిందట అక్కడ నుంచి వచ్చి విజయవాడలో నివాసముంటూ సహజీవనం చేస్తున్నారు. నెల రోజుల కిందట నివాసాన్ని తాడేపల్లి యానాదుల కాలనీకి మార్చారు. ఇద్దరికీ మద్యం అలవాటు ఉందని, కిరణ్ బుజ్జి సంపాదన మీదే ఆధారపడడంతో ప్రతిరోజూ గొడవపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి ఇద్దరూ కొట్టుకున్నారని, ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన అనంతరం ఇద్దరూ గొడవపడుతున్నప్పటికీ అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఉద్రేకంలో ఉన్న కిరణ్ బుజ్జిపై బ్లేడ్ లాంటి ఆయుధంతో దాడి చేశాడు. వెంటనే తేరుకున్న పోలీసులు గాయపడిన బుజ్జికి ప్రథమ చికిత్స చేశారు. ఇదే సమయంలో కిరణ్ అక్కడ నుంచి చల్లగా జారుకున్నాడు. ప్రస్తుతం బుజ్జి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, జరిగిన సంఘటనపై ప్రాథమిక విచారణ చేసి కేసు నమోదు చేయనున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలి

తాడేపల్లి రూరల్: మహనీయుల్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని కాకినాడ ఎస్పీ సీహెచ్.విజయరావు తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో శనివారం సమతావాది, బాబూజీ మాదిగ రైట్స్ ప్రొటెక్షన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్‌రావు, గుర్రం జాషువా విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాకినాడ ఎస్పీ విజయరావు, రాజమండ్రి జిల్లా జడ్జి ఎం.నాగేశ్వరరావు పాల్గొని, విగ్రహాలను ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే జీవితాల్లో మార్పు వస్తుందని, అంబేద్కర్, జగ్జీవన్‌రావు, గుర్రం జాషువాలు సంఘ సంస్కర్తలు అయ్యారని చెప్పారు. తాను చదువుకుంటున్న రోజుల్లో అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల్ని పాటించానని తెలిపారు. విగ్రహాల కమిటీ అధ్యక్షులు బి.ప్రసన్నకుమార్, ఆర్.రాంబాబు, పచ్చల రాజారావు, వి.కిశోర్, ఎం.వినోద్‌బాబు, అద్దేపల్లి గణపతి, బి.నాగేశ్వరరావు, బి.పురుషోత్తం పాల్గొన్నారు.